క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో ఆశ కార్యకర్తగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో కెంబూరు చంద్రకళ మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబానికి శ్రీఆదిలక్ష్మి ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, సంతవురిటి గ్రామ సర్పంచ్ బుడారి లక్ష్మణరావు రూ.10 వేల ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మీసాల రవికుమార్, ఏర్నేన శ్రీనివాసరావు, బోనేల పట్టాభి, ఏఎన్ఎం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నిద్దాలమ్మ యాత్ర



ప్రత్యేక అలంకరణలో నిద్దాలమ్మ తల్లి

జి.సిగడాం: మండలంలోని నిద్దాం గ్రామంలో వెలిసిన నిద్దాలమ్మ అమ్మవారి యాత్ర మహోత్సవాలు ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం అమ్మవారి తీరువీధి ఉత్సవం, 9వ తేదీన లక్ష దీపారాధన, 10, 11 తేదీల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



యసితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శామ్యేల్ లెంక

జి.సిగడాం: స్థానిక మోడల్ స్కూల్లో 10వ తరగతి చదువుతున్న కింతలి యసిత రథ సప్తమి పురస్కరించుకొని ఇటీవల శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో మూడో స్థానంలో నిలిచింది. దీంతో ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక పాఠశాలలో బుధవారం అభినందనలు తెలిపారు. విద్యార్థినికి గైడ్ ఉపాధ్యాయుడిగా కోట తిరుపతిరావు(కేటీఆర్) వ్యవహరించారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న దృశ్యం

జి.సిగడాం: గ్రామాల్లో చేపడుతున్న రహదారి పనుల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ శ్రీరాములు సూచించారు. మండలంలోని పాలఖండ్యాం కూడలి నుంచి నిద్దాం మీదుగా అధ్వాన్నంపేట గ్రామం వరకు చేపడుతున్న బీటీ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. పనులు చేపట్టే సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి, మండల జనసేన అధ్యక్షుడు మీసాల రవికుమార్, నాయకులు వజ్జిపర్తి రఘురాం, మీసాల రామకృష్ణంనాయుడు, ఏర్నేన శ్రీరాములు తదితరులు ఉన్నారు.

సుందరరావు మృతికి సంతాపం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఏర్పడక ముందు ఆంధ్రా యూనివర్సిటీ పోస్టు గ్రాడ్యుయేషన్ సెంటర్‌గా ఉన్న సమయంలో సీనియర్ ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా, ప్రత్యేక అధికారిగా ఎం.సుందరరావు సేవలు అందించారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు సమయంలో ఆయన ఏయూకి వెళ్లిపోయారు. అయితే గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలో ఆయన మృతి చెందారు. దీంతో ఆయన మృతికి బీఆర్ఏయూలో బుధవారం సంతాపం తెలిపారు. ఆయనతో కలిసి పనిచేసిన ఎకనామిక్స్ ప్రొఫెసర్, రెక్టార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య విద్యా ప్రగతికి సుందరరావు చేసిన కృషిని వివరించారు.

సరుగుడుతో సిరులు

- వరి, చెరుకుకు ప్రత్యామ్నాయంగా సాగు
- ఆసక్తి చూపిస్తున్న రైతులు
- ఏడాదికేడాది పెరుగుతున్న విస్తీర్ణం



పెద్దరావుపల్లిలో పెరుగుతున్న సరుగుడు పంట



అజ్జరాంలో సరుగుడు తోట

ఎచ్చెర్ల: తక్కువ వ్యయంతో అధిక లాభాలు వచ్చే పంటలపై రైతులు దృష్టి సారిస్తున్నారు. దీనిలో భాగంగా సరుగుడు సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. చెరుకు, వరితో పోల్చుకుంటే సరుగుడు సాగుకు వ్యయం తక్కువగానే ఉండడం, ఒకసారి నాట్లువేసి మొక్క పెరిగే వరకు సంరక్షిస్తే, నాలుగేళ్లలో తోట కోతకు వచ్చి ఆశించిన మేరకు దిగుబడి వస్తోంది. వరి, చెరుకు వంటి పంటలు చేతికొచ్చేసరికి తెగుళ్లు, సాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీంతో వీటి స్థానంలో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సరుగుడు సాగుపై మొగ్గు చూపుతున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో...

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రస్తుతం సరుగుడు సాగు సుమారు 1,500 ఎకరాల్లో ఉంది. అంతేకాకుండా సరుగుడు సాగు ఏటా పెరుగుతోంది. సరుగుడు టన్ను ధర రూ.7 వేలు నుంచి రూ.9 వేల వరకు పలుకుతోంది. ఎకరా సాగుకు రూ.50 వేలు అయితే, నాలుగేళ్ల తర్వాత ఎకరాకు 45 టన్నుల నుంచి 70 టన్నుల దిగుబడి వస్తోంది. దీంతో సుమారుగా రూ.4 లక్షల ఆదాయం ఉంటుంది. దీంతో సాగుచేసేవారి సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూ వస్తోంది.

సాగు సులభం



సరుగుడు మొక్కలు నాటి మొక్క ఎదిగేవరకు కలుపు మొక్కలు తొలగించి సంరక్షించుకుంటే సరిపోతుంది. సరుగుడు ఒకసారి వేస్తే చాలు నాలుగు, అయిదేళ్లలో తోట ఎదిగి కోతకు వస్తుంది. వ్యాపారులే తోటల వద్దకు వచ్చి పంట కొనుగోలు చేస్తారు. అంతరపంటలు కూడా వేసుకునే అవకాశం ఉంటుంది.

– పిన్నింటి రాముడు, రైతు, మురపాక

లాభదాయకం



చెరుకు పంటకు సుమారుగా ఎకరానికి రూ.40 వేలు పైన పెట్టుబడి అవుతుంది. పంట అభివృద్ధి బాగుంటే రూ.50 వేల పైబడి ఆదాయం ఉంటుంది. చేసిన అప్పుకు వడ్డీ లెక్క వేస్తే ఆదాయానికి సరిపోవడం లేదు. అందుకే ప్రత్యామ్నాయంగా లాభదాయకంగా ఉండే సరుగుడు పంటలను వేస్తున్నాం.

– బొట్ట దాలినాయుడు, అజ్జరాం, ఎచ్చెర్ల

ఆదాయం బాగుంది

సరుగుడు ఎకరాకు 45 నుంచి 70 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. తక్కువ ఖర్చుతో ఆదాయం కూడా దాదాపు రూ.4 లక్షలకు మించి లభిస్తోంది. సాగునీరు లభించని ప్రాంతాల్లో ఈ పంట అనువుగా ఉంటుంది. ఆదాయం బాగుండడంతో సాగుపై దృష్టి సారిస్తున్నాం.

– రెడ్డి గోపాల్, రైతు, చిన్నయ్యపేట

కమ్మసిగడాం జాతర.. ట్రాఫిక్ ఆంక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ అవతారం

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాం గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ అంక్షలు విధించనున్నట్లు జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం తెలిపారు. మండల కేంద్రంలోని జేఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీ నుంచి నెల్లిమర్ల వైపు భారీ వాహనాల రాకపోకలకు అనుమతి లేదన్నారు. పైడిభీమవరం నుంచి సంచాం మీదుగా నెల్లిమర్ల వెళ్లాల్సి ఉంటుందని, అలాగే రణస్థలం వైపు వచ్చే వాహనాలు కూడా సంచాం వైపు నుంచి పైడిభీమవరం హైవేపైకి రావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆలయ కమిటీ సభ్యుల సూచనల మేరకు కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే ఆటోలు, కార్లు, ఇతర వాహనాలు నిలపాలన్నారు. రణస్థలం వైపు నుంచి వచ్చే వాహనాలకు లోచర్లపాలెం వద్ద, నెల్లిమర్ల వైపు నుంచి గుడికి వచ్చే భక్తులకు కమ్మసిగడాం పెట్రోల్ బంకు వద్ద, దేవరాపల్లి వైపు వాహనాలకు కమ్మసిగడాం రైస్ మిల్లు వద్ద పార్కింగ్ స్థలాలు కేటాయించామని తెలియజేశారు. జాతరను డ్రోన్, సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తామని, ఆకతాయిలు, తాగుబోతులు జాతరలో మహిళలపై అసభ్యకరంగా, అనుచితంగా ప్రవర్తించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ ఆంక్షలు ఉల్లంఘిస్తే రూ.2 వేలు అపరాధ రుసుము విధిస్తామన్నారు. సమావేశంలో జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి ఉన్నారు.

పరామర్శ



చిల్లపేట ఎర్రవరంలో పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని చిల్లపేట ఎర్రవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చిల్ల శంకర్‌రెడ్డి తండ్రి సహదేవుడు, సరగడపేట గ్రామంలో కొల్లి సూర్యనారాయణ భార్య రామలక్ష్మి ఇటీవల మరణించారు. దీంతో ఇరు కుటుంబాలను ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, ఎచ్చెర్ల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్, మాజీ సర్పంచ్ మింది జనార్దన్ రెడ్డి, నాయకులు చిల్ల గోవింద, చిల్ల సూరి, తాతారావు, ఉప సర్పంచ్ పి.శ్రీనివాస రెడ్డి, పైడి భీమవరం ఎంపీటీసీ ఆకల శ్రీనివాసరావు, బావిశెట్టి నారాయణరావు ఉన్నారు.

వైభవంగా నగర సంకీర్తన



జేఆర్‌పురంలో జరుగుతున్న నగర సంకీర్తన ర్యాలీ దృశ్యం

రణస్థలం: మండలంలోని కోష్ట గోశాల, గోకులానంద ఆశ్రమాల్లో శ్రీకృష్ణ చైతన్య మఠం శాఖ అధ్వర్యంలో జగన్నాథ, సుభద్ర, బలరామ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా నగర సంకీర్తన ర్యాలీ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈనెల 7వ తేదీన ఉదయం 11.32 గంటలకు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం, అన్న సమారాధన కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. జేఆర్‌పురం నుంచి కోష్ట వరకు సంకీర్తన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, శ్రీకృష్ణ చైతన్య భక్తులు, స్వామీజీలు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని పొన్నాడ గ్రామంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో 62 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వారిలో 25 మంది వృద్ధులను శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు.

కేంద్ర బడ్జెట్‌తో ప్రయోజనం శూన్యం

- ధ్వజమెత్తిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు



ధర్నా చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రభుత్వ రంగ సంస్థలకు, ఉద్యోగులకు, పేద, మధ్య తరగతి ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావులు ధ్వజమెత్తారు. బీఎస్ఎన్ఎల్ ఈయూ పిలుపు మేరకు దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళంలోని సంచార భవన్ వద్ద బుధవారం కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 75 ఏళ్లుగా అనేక పోరాటాలు ద్వారా సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులను ఉపసంహరించుకుని, కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేలా ఉందన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు అభిమన్యు, అరుణ, లక్ష్మి, హెచ్.డిల్లీశ్వరరావు, శివప్రసాద్, వి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, ఎ.శివప్రసాద్ తదితరుల పాల్గొన్నారు.

సిఫార్సులకు పెద్దపీట..
సామాన్యులకు నిరాశ..!

- ఆఫ్‌లైన్ టిక్కెట్ల విధానంతో ఔత్సాహికులకు కష్టాలు
- మూడు రోజులుగా నిరీక్షించిన వారికి నిరాశ



శ్రీకాకుళం: నగరంలోని డచ్ భవనం మైదానం నుంచి రథసప్తమి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన హెలీ టూరిజంలో సిఫార్సులకు పెద్దపీట వేశారు. ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు హెలీ టూరిజం నిర్వహిస్తామని ముందుగా ప్రకటించినప్పటికీ, డిమాండ్ ఎక్కువగా ఉండడంతో 5వ తేదీన కూడా కొనసాగించారు. మొదటి రెండు రోజులు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు విక్రయించడం వలన ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. అయితే కొంతమంది ఆన్‌లైన్‌లో టిక్కెట్లు తీసుకోకుండా అడ్డదారిలో టిక్కెట్లు పొందాలనుకొని, ప్రజాప్రతినిధుల ద్వారా హెలీకాప్టర్ నిర్వాహకులపై ఒత్తిడి తీసుకొని రావడంతో మంగళ, బుధవారాల్లో ఆఫ్‌లైన్‌లో టిక్కెట్లు జారీ చేశారు. దీంతో సామాన్య ప్రజలకు టిక్కెట్లు దొరకడం కష్టతరంగా మారింది. మరోవైపు మంగళవారం హెలీకాప్టర్ ఎక్కేందుకు సోమవారమే ఆన్‌లైన్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్నవారికి రీఫండ్ చేస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

5 నిమిషాలకు కుదింపు

హెలీకాప్టర్‌లో విహరించేందుకు ధర రూ.1800లుగా నిర్ణయించి, 8 నిమిషాల పాటు గగనతలంలో విహరింపజేస్తామని ముందుగా ప్రకటించారు. మొదటి రెండు రోజులు 8 నిమిషాలు తిప్పారు. అయితే అనంతరం మంగళ, బుధవారాల్లో ఈ సమయాన్ని 5 నిమిషాలకు కుదించారు. నిర్వాహకులు సమయాన్ని కుదించిన విషయాన్ని మైక్ ద్వారా ప్రకటించారు.

1,042 మందికి అవకాశం

హెలీ టూరిజంలో నాలుగు రోజుల పాటు 1,042 మంది విహరించారు. ఒక్కొక్క ట్రిప్పులో మొత్తం 6 మంది ప్రయాణించారు. దీంతో మొత్తం రూ.18,75,600 ల ఆదాయం వచ్చినట్లు అధికారులు ప్రకటించారు.

తేదీ	2	3	4	5
ట్రిప్పులు	33	43	47	50

తీవ్ర నిరాశ చెందాను

మా కుటుంబం నుంచి ఆరుగురం హెలీకాప్టర్‌లో విహరించేందుకు సోమవారం టిక్కెట్లు బుక్ చేసుకున్నాం. అయితే ఆరోజు సాయంత్రం వరకు ఎదురుచూసిన మాకు మంగళవారం రావాలని సూచించారు. మంగళవారం మా నుంచి టిక్కెట్లు డబ్బులు వసూలు చేశారు. అయితే ఆరోజు సాయంత్రం వాతావరణం సరిగాలేదని బుధవారం రావాలని సూచించారు. బుధవారం ఉదయం వచ్చి సాయంత్రం 3 గంటల వరకు వేచి ఉన్నప్పటికీ అవకాశం రాలేదు. మూడు రోజుల తిరిగినా హెలీకాప్టర్ ఎక్కే అవకాశం దొరకకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యాము.

దువ్వాడ నరసింహ చౌదరి, శ్రీకాకుళం

నిత్యావసర సరుకుల పంపిణీ



శ్రీకాకుళం పట్టణంలోని పాత ఎంప్లాయిమెంట్ ఆఫీసు వద్దనున్న ఖ్యాతి వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకుల పంపిణీ బుధవారం జరిగింది. ఎల్ఐసీ డవలప్‌మెంట్ ఆఫీసర్లు శ్రీకాకుళం బ్రాంచి ఆధ్వర్యంలో ఈ సరుకులు అందజేశారు.

– శ్రీకాకుళం కల్చరల్

అన్నదానం



రథసప్తమి పర్వదినం పురస్కరించుకొని అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు శ్రీకాకుళం జిల్లా, టౌన్ హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు మెట్ట నాగరాజు, అంధవరపు తిరుమలరావు, ట్రాఫిక్ జామ్ శ్రీను, ఆనంద్ తదితరులు తెలియజేశారు. ప్రతిఏటా నిర్వహించిన విధంగానే ఈ ఏడాది కూడా 15 వేల మందికి అన్నప్రసాదం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హోటల్ అసోసియేషన్ ప్రతినిధులు జామి రాజశేఖర్, గణపతి, శ్రీనివాసరావు, గజపతి, కెల్ల కిషోర్‌కుమార్, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.సతీష్, భానుమూర్తి, సతీష్, కోరాడ గోవిందరాజులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం అర్బన్

మరమ్మతులు ఎన్నడో..?



ఎచ్చెర్ల నుంచి చినరావుపల్లి, సంత సీతారాంపురం, భగీరథపురం వైపు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. రోడ్డుపై పిక్క వేసి, రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేయలేదు. దీంతో పిక్క రోడ్డుపైకి వస్తోంది. ఫలితంగా వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

చి'వరి'కి మిగిలేది..?



బాతువలో కల్లంలోనే ఉన్న ధాన్యం

- పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరగని వైనం
- లక్ష్యం పూర్తవ్వకుండానే నిలిపివేత



డీఆర్‌వలస-బాతువ గ్రామాల మధ్యలో పొలాల్లో ఉన్న ధాన్యం

జి.సిగడాం: ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చిన సమయంలో దళారుల చేతుల్లో పడుతుండడంతో అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటను పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం ఎలా అమ్ముకోవాలో తెలియక గగ్గోలు పెడుతున్నారు. జి.సిగడాం మండలంలో ఈ ఏడాది 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశారు. అయితే పంట దిగుబడులు అధికంగా రావడంతో మరో 2 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. అయితే మొత్తం 42 రెవెన్యూ గ్రామాల్లో 21 రైతు సేవా కేంద్రాల ద్వారా కేవలం 14 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. మిగతా 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉన్నాయి. గత నెల 23వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలును ప్రభుత్వం నిలుపుదల చేసింది. బాతువ, పున్నాం, డీఆర్‌వలస, జాడ, గొబ్బూరు, ఎందువ, గెద్దకంచరాం, మధుపాం, దేవరవలస, పెనసాం గ్రామాల్లో ధాన్యం బస్తాల్లో ఉంచారు. వీటిని కొనుగోలు చేసేందుకు అధికారులు వెనుకంజు వేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోతే ధర్నాలు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మరోవైపు ఇప్పటికే పలుచోట్ల దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

కొనుగోలు చేయాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల వద్ద నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేశారు. మండలవ్యాప్తంగా అప్పట్లో తక్కువ దిగుబడి వచ్చినా 17 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలి.

– బూటు అప్పారావు, బాతువ, జి.సిగడాం

నివేదిక అందించాం



మండలంలో రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. మండలానికి మరో 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే చర్యలు తీసుకుంటాం.

– యర్రా శారద, వ్యవసాయశాఖ అధికారి, జి.సిగడాం

8న శోభాయాత్ర

శ్రీకాకుళం కల్చరల్: ఈనెల 8వ తేదీన భీష్మ ఏకాదశి పురస్కరించుకొని వేంకటేశ్వరస్వామి శోభాయత్ర నిర్వహించనున్నట్లు ప్రోగ్రామ్ మేనేజర్ ఎం.లలితామణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్ర ఫాజుల్‌భాగ్ పేటలోని నారాయణ తిరుమల నుంచి ఏడు రోడ్ల కూడలి మీదుగా పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు సాగుతుందన్నారు.